ప్రజాశక్తి
శనివారం 28 సెప్టెంబర్ 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

విద్యార్థులకు ఎంఎల్‌ఎ అభినందనలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు పంచాయతీ చెన్నపల్లిపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అభినందించారు. విజయవాడ వరద బాధితుల కోసం విద్యార్థులు విరాళాలు సేకరించిన విషయం తెలిసిందే. సేకరించిన 54,161 రూపాయలు డీడీని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి ఆ పా ఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి ప్రసాద్, గ్రామ పెద్దలు వీరబోయిన గం గాధర్ యాదవ్, రాజా, ఊటుకూరు అవినాష్, దేవా, పాఠశాల విద్యా క మిటీ చైర్మన్ ఆత్మకూరు రవీంద్రనా థ్ టాగూర్ లు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ సహృదయంతో, స్వచ్ఛందంగా వరద బాధితులకు విరాళాల సేకరించడం అభినందనీయమని అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రైతు నెత్తిన 'పెట్రో'పంపు..!

- పరిహారం ఇవ్వకుండానే పనులు
- అడ్డుకున్న సిపిఎం నేతలు
- అరెస్ట్, విడుదల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి, పేరుతో పేద, మధ్య తరగతి రైతుల నడ్డి విరుస్తున్నారు..ఏదైనా అభివృద్ధి కార్యక్రమం జరిగే క్రమంలో రైతులకు నష్టపరిహారం చెల్లించి పనులు చేయాల్సి ఉంటుంది. ఇటీవల న్యాయమైన పరిహారం కాకుండా ప్రభుత్వం, యాజమాన్యాలు భిక్షమేసినట్లు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కృష్ణపట్నం పోర్టు - హైదరాబాద్‌కు రూ. 1962 కోట్లతో భారీ పెట్రో పైప్‌లైన్ పనులు జరు గుతున్నాయి. ఇందుకూరుపేట మండలంలోని కొందరు రైతులకు పరిహారం చెల్లించకుండా పనులు చేసేందుకు శుక్రవారం యజమాన్యం ప్రయత్నం చేసింది. సిపిఎం నేతలు ,రైతులతో కలిసి పనులు అడ్డుకున్నారు. పోలీసులు నాయకులు, రైతులను అరెస్ట్ చేసి, అనంతరం విడుదల చేశారు. అరెస్ట్‌లపై సిపిఎం ప్రజా సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతోన్న అభివృద్ధి పనులు ఇటీవల కాలంలో జిల్లాలో నత్తనడక సాగుతున్నాయి. భారీ ప్రాజెక్టులు ప్రకటిస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. ఏదైనా పనులుచేసే సమయంలో అక్కడ నిర్వాసితులు, రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల కృష్ణపట్నం పోర్టు నుండి హైదరాబాద్ సమీపంలోని మాదవరం వరకు ఈ ప్రాజెక్టు పనులు చేస్తుంది. రెండు రాష్ట్రాలకు ఉపయోగపడేలా పెట్రోల్, డీజిల్ పైప్‌లైన్ నిర్మాణం సాగుతోంది. లారీల ద్వారా రవాణా చేసే ఈ విధానంలో ఇక్కడ నుంచి నేరుగా పైప్‌లైన్ ద్వారా భూమిలోపల నిర్వహించాలని భావిస్తున్నారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) దీనిని నిర్మిస్తో ంది. రూ 1962 కోట్ల వ్యయంతో, 451 కిలో మీటర్ల పొడవునా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఇది అత్యంత సున్నితమైన, ప్రమాద కరమైన ప్రాజెక్టు. ఎక్కడైనా పైల్‌లైన్ లీక్ అయినా, ఏదైనా ప్రమాదం జరిగినా పెద్ద ఎత్తున నష్టం జరుగు తుంది. దీనిని భూమి లోపల కనీసం 12 అడుగుల లోపల అమర్చాల్సి ఉంటుంది. అధికారులు మాత్రం కేవలం ఆరు అడుగులోపే దీనిని నిర్మాణం చేయడానికి ప్రయ త్నాలు చేస్తున్నారు. ఇందుకోసం భూ సేకరణ చేసి భూమి కలిగిన రైతులు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అటు తర్వాత పనులు చేయాలి. ఇందుకూరుపేట మండలం, పల్లెపాడు మీదుగా ఈ పైప్‌లైన్ నిర్మాణం సాగుతోంది.

పైపుల లోడుతో లారీ వచ్చిన దృశ్యం

పరిహారం చెల్లించకుండానే..!

ఇందుకూరుపేట మండలం, పల్లెపాడు సమీపంలో పైప్‌లైన్ నిర్మాణ పనులు చేయడానికి యాజమాన్యం చూస్తుంది. ఇక్కడ ఎకరాకనీ సం రూ.75 నుంచి కోటి రూ పాయల వరకు పలుకుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఇక్కడ 16 మీటర్లు వెడల్పు భూమి తీసుకుంటున్నారు. కేవలం ఆరు అడు గుల లోతులోనే పైప్‌లైన్ నిర్మాణం చేయనున్నారు. ఎకరారూ.5 లక్షల చొప్పు న తీసుకున్న భూమికి రూ. 50వేలు, పంటకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. ఇప్పటికీ రైతులకు అందలేదు. పరిహారం విషయ ంలో రైతులు కోర్టును ఆశ్ర యిం చారు. కేసు కోర్టులో ఉండగానే ఆ సంస్థ శుక్రవారం లారీల్లో పైప్‌లు, జెసిబిలు తీసుకొని వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు అడ్డుకున్నారు. సిపిఎం నాయకులు రైతులకు మద్దతుగా నిలిచారు.

సిపిఎం నేతలు, రైతులు అరెస్ట్

ఇందుకూరుపేట మండలం, పల్లెపాడు వద్ద రైతులు బిపిసిఎల్ అధికారులను అడ్డుకున్నారు. సిపిఎం జిల్లా నాయకులు టివివి ప్రసాద్, అజయ్‌కుమార్‌లు రైతులు అడ్డుకున్నారు. పరిహారం చెల్లించిన తరు వాతే పైప్‌లైన్ వేయాలని, నిర్మాణం భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు భారీగా చేరుకొని రైతులు, సిపి ఎం నాయకులను అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్రమ అరెస్ట్‌లను సిపిఎం, సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు ఖండించారు. అనంతరం నాయకులు, రైతులను విడుదల చేశారు.

టివివి ప్రసాద్‌ను అరెస్టు చేస్తున్న దృశ్యం

సిపిఎం జిల్లా కమిటీ ఖండన

సిపిఎం నాయకులను, రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఖండించారు. రైతులకు నష్టపరిహారం చెలించిన తర్వాతే పైపులైను పనులు చేపట్టా లన్నారు. దీన్ని ప్రశ్నించిన నాయ కులను, రైతులను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తే తిప్పికొడతామని హెచ్చరించారు.

రైతుల అరెస్ట్ అన్యాయం

రైతులకు సంబంధించిన వ్యవసాయ భూముల్లో వారి అనుమతులు లేకుండా దౌర్జన్యకరంగా అభివృద్ధి పనుల పేరుతో పెట్రోల్ పైపు లైన్ల నిర్మాణం చేపట్టడం దుర్మార్గమని, ఈ పనులను అడ్డుకున్న రైతాంగానికి అండగా నిలిచిన సిఐటియు జిల్లా అధ్యక్షుడు టి.వి.వి ప్రసాద్‌ను అక్రమంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని సిపిఎం, సిఐటియు, డివైఎఫ్ఐ, ఏపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీలు ఖండించింది. ఈ మేరకు పత్రికలు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్యలు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రైతులకు అండగా నిలిచిన సిపిఎం నాయకులను పోలీసులు అక్రమ అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ జిల్లా కమిటీ, సిఐటియు, డివైఎఫ్ఐ, ఏపి రైతు సంఘం, వ్యవసాయ కూలి సంఘం తదితర సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎపి రైతుల పొట్ట కొట్టొద్దు

ప్రజాశక్తి-ముత్తుకూరు: మండలంలో సాగరమాల హైవే అలైన్మెంట్ను మార్చి పేద రైతుల పొట్ట కొట్టడం సరికాదు, ఎన్‌హెచ్ఎఐ ఇంజినీర్లు అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ నాయకులు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య లు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో సాగరమాల నేషనల్ హైవే రోడ్డు నిర్మాణాన్ని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చేపట్టిందన్నారు. దాదాపు 14 కిలోమీటర్ల రోడ్డు కాంట్రాక్ట్ పనులను ఎఎంఆర్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ అను సంస్థ నిర్వహిస్తుందన్నారు. గతంలోనే భూసేకరణ కోసం నోటిఫికేషన్ వేసి విడుదల చేసి సర్వే చేసి బాధిత రైతులకు నష్టపరిహారాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేసింది, దానిపై సిపిఎం ఆధ్వర్యంలో ఎకరాకు 80 లక్షల రూపాయల వంతున పరిహారం చెల్లించాలని ఆందోళన కూడా నిర్వహించిందన్నారు. ఎకరాకు 33 లక్షల రూపాయలు వంతున ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. తీరా కొంతమంది అధికారపార్టీ నేతల ఒత్తిడిలకు లొంగి కొత్తగా అలైన్మెంట్ మార్చడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు:ఆకలికి అందరూ బంధువులే" అనే నినాదంతో శుక్రవారం ఓ దాత సహాయంతో పేదవారికోసం కందుకూరులో ఊరి బయట వృద్ధులను,పిల్లలను గుర్తించి వారికి ఆహారం పంపిణీ చేశారు.ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్య తగా పేదవారికి సహాయం అందిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని షంషేర్ అన్నారు.

30న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో

ప్రజాశక్తి-నెల్లూరు

ఆశావర్కర్ అక్రమ తొలగింపును నిరసిస్తూ కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రావులకొల్లు గ్రామం ఆశా వర్కరుగా విధులు నిర్వహిస్తున్న పందిటి విజయమ్మను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నటు ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ తెలిపారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన 18 సంవత్సరాల నుంచి పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆశా కార్యకర్తగా వైద్య ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేస్తూ, వైద్య ఆరోగ్య కార్యక్రమాలను పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్న పందిటి విజయమ్మపై రాజకీయ వేధింపులు అధికమయ్యాయన్నారు.తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆగ్రామ సర్పంచి వెంగపనాయుడు తన అనుచరులను ఆశా కార్యకర్తగా నియమించుకోవాలన్న దురుద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిపై రాజకీయ వత్తిడి తీసుకొచ్చి పి.విజయమ్మను విధుల నుంచి తొలగించారని, ఈ చర్యలు దారుణమన్నారు. పి.విజయమ్మ కుటుంబ పరిస్థితి దారుణంగా ఉందని, కేవలం ఆమె సంపాదన ఆధారంగానే కుటుంబ పోషణ జరుగుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చిరుద్యోగులపై రాజకీయ వేదింపులు అధికమైయ్యాయని, ఆ పార్టీ ప్రధాన నాయకులు మాత్రం తమ ప్రభుత్వ పాలనలో ఎవరిపై కక్ష సాధింపు చర్యలుండవని పత్రికల్లో ప్రకటనలు ఇస్తుంటే జిల్లాలో మాత్రం అందుకు విరుద్ధంగా ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఈ నెల 30వ తేదిన కలెక్టరేట్ ఎదుట ఆశా కార్యకర్తల ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ప్రతి ఆశా కార్యకర్త హాజరై తమ సత్తాను ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.విజయలక్ష్మి నాయకులు కె.లక్ష్మి, డి.మేరి, పి.అరుణ, ఎస్‌కె గౌసియా, పి.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు

కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రల ఖనం పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.ఈ పోటీలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథి లుగా సి జి ఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషా కిరణ్ హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 27న జరుపుకుంటారు. అనంతరం సూపరింటెండెంట్ మురళీ కృష్ణ సహకారం తో పాఠశాలకు మూడు సీలింగ్ ఫ్యాన్స్ హెడ్ మాస్టర్ భాస్కర్ రావు కు అందజేశారు. కార్యక్రమంలో మల్లెల శ్రీనివాసులు, జయేంద్ర, ఉపాధ్యాయులు హరీష్, రాశి విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు.

ప్రజాశక్తి-వెంకటాచలం:కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం లో శ్రీ పొట్టి శ్రీ రాములు భవనంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. విజయ భాస్కర రావు, విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ డాక్టర్ కే. సునీత హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య విజయ భాస్కర రావు మాట్లాడుతూ పర్యాటక రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, సాంస్కతిక మార్పులపై, సామాజిక స్థిరత్వంపై పడే ప్రభావం గురించి వివరించారు. పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని, అలాగే సుస్థిర పర్యాటకం పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తుందని వివరించారు..కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.విజయ, టూరిజం మేనేజ్మెంట్ విభాగాధిపతి డాక్టర్ కోటా.నీల మణికంత, ఆచార్య కె.వి.ఎస్ఎన్. జవహర్ బాబు, డాక్టర్ ఎం.త్యాగరాజు, డాక్టర్ పి.సుజాత, డాక్టర్ జె విజేత, ఎం.విక్రం కుమార్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి–కందుకూరు

కందుకూరు టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండల నరేంద్ర ప్రపంచ పర్యాటక దినోత్సవం గురించి విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్క వ్యక్తి ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రాంతానికి వెళ్లి అక్కడ విశేషాలను తెలుసుకొని నూతన ఉత్తేజం పొందాలని కోరారు.

క్రీడా పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు:ఉమ్మడి ప్రకాశం జిల్లా. అండర్ 19. ఎస్ జి ఎఫ్. హ్యాండ్ బాల్, హాకీ. సెలక్షన్స్. శుక్రవారం కందుకూరు టి ఆర్ ఆర్. ప్రభుత్వ. జూనియర్. కళాశాలలో. జరిగాయి.. ఈ సెలక్షన్స్ లో జిల్లా నుండి. హ్యాండ్ బాల్ కు. 50 మంది. బాల బాలికలు. పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన. బాల బాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేయడం జరిగింది. ఎంపికైన జట్లు హాకీ కాకినాడలో. హ్యాండ్ బాల్ విజయనగరం జిల్లాలో అడుతారని తెలిపారు. 68వ. ఎస్ జి ఎఫ్. రాష్ట్ర ఛాంపియన్షిప్ లో పాల్గొంటారని. ఆర్ ఐ ఓ. సైమన్ విక్టర్, డి ఐ వి ఓ. శ్రీనివాసరావు. స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఈ చింపారెడ్డి తెలిపారు. ఈ సెలక్షన్స్ లో. పిడి. తొట్టెంపూడి సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొంది. ప్రకాశం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను కోరారు.

జగన్ కుటుంబమంతా క్రిస్టియన్లే

ప్రజాశక్తి-నెల్లూరు :మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహర్‌రెడ్డి కుటుంబం అంతా వంద సంవత్సరాల క్రితం నుండే క్రిస్టియన్లు అయిన టిడిపి జాతీయ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవరాం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు . జగన్ తాత వైఎస్ వెంకటరెడ్డి 1925లోనే క్రిస్టియన్ అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, విజయమ్మ, జగన్ బార్య భారతి, అంతా క్రిస్టియనే అన్నారు. జగన్ వివాహం కూడా క్రిస్టియన్ మ్యారేజ్ అన్నారు. ఆయన వివాహ కార్డులను ప్రదర్శించారు. జగన్ హిందువులను మోసం చేస్తున్నారని విమర్శించారు. కుటుంబం మొత్తం క్రిస్టియన్ సాంప్రదాయాలు పాటిస్తారన్నారు. ఆయన మాత్రం హిందువని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. జనగ్ కుటుంబాన్ని నమ్మవద్దని, హిందువులు, క్రిస్టియన్లు మోసం చేస్తున్నారన్నారు. తిరుమలలో ఆయన వెళ్లాలంటే డిక్లరేషన్‌పై సంతకం పెట్టాలన్నారు.

"లెగ్ ఆపరేటింగ్ వాటర్ టాప్"

ప్రజాశక్తి-కందుకూరు: కరోనా ప్రభావంతో సామాజికంగా స్వచ్ఛతపై పెరిగిన నేపథ్యంలో నీటి ట్యాప్ లను చేతితో కాకుండా (లెగ్ ఆపరేటింగ్ రెసిప్రో కౌంటింగ్ వాషింగ్ హెడ్స్) కాలితో కింద తొక్కితే నీరు వచ్చేలా ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ పరిశోధనా విభాగం డీన్ డాక్టర్ ఎం.లక్ష్మణరావు కాలేజీ అకడమిక్ ఇన్‌ఛార్జి ఎస్.ఎన్.మీరావలి మరో ఇద్దరు విద్యార్థులు రూపకల్పన చేశారు. ఒక్కో ట్యాప్ వ్యయం 500 రూపాయల లోపు ఉండేలా చేసి పేదవారికి సైతం అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఫుట్ స్టెప్ తో అవసరమైన మేరకు నీరు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్.మౌనిషా, కే.వెంకటేష్, రెండవ సంవత్సరం ఇఇఇ విద్యార్థులు బాగా స్వామ్య లయ్యారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే.విజయ్ శ్రీనివాస్ లు వెల్లడించారు. యు.జి.సి. అర్హత ఉన్న ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ జర్నల్ లో ప్రచురణకు అర్హత సాధించిందని డీన్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. దీనికి భారత ప్రభుత్వ వాణిజ్య,పారిశ్రామిక విభాగం నుండి పేటెంట్ హక్కులను కూడా పొందినట్లు డీన్ వెల్లడించారు.

పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కందుకూరు: మున్సిపాలిటీ ఉప్పు చెరువు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఏపీ ఎస్ ఎస్ డి సి నెల్లూరు,ఎంప్లాయిమెంట్ ఆఫీస్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కె. మస్తానయ్య మాట్లాడుతూ ఈ జాబ్ మేళా లో యంగ్ ఇండియన్ పివిఆర్ లిమిటెడ్,లూకాస్ టివిఎస్ లిమిటెడ్, కోల్గేట్ ఫార్మలివ్,, అమర్ రాజా బ్యాటరీ నిర్వహికులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళా లో 171 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కాగా వారిలో ప్రతిభ కనబరిచిన. 53 మందిని ఎంపిక చేసి వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేయడం జరిగింది. ఇటువంటి అవకాశాలను నిరుద్యోగ యువతీ సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో సీడ్ ప్రతినిధి సిహెచ్ శ్రీనివాసులు, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ప్రతినిధి నరసింహ ,కందుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ సివిల్ హెచ్ ఓ డి ఎస్ కె రియాజుద్దీన్ , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డివిఎస్ చంద్రశేఖర్ ,టి పి ఓ శ్రీ కె సుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

ప్రజాశక్తి-కందుకూరు:కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపుతో విజయవాడ వరద బాధితులకు తమవంతుగా పలువురు సాయంచేస్తూ దాతృత్వం చాటుకుంటున్నారు. టిఆర్‌ఆర్ జూనియర్ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రూ.48, 396 చెక్కును వరద బాధితుల సహాయార్థం ఎంఎల్‌ఎకు అందజేశారు.పలువురు దాతలు ఎమ్మెల్యే నాగేశ్వరరావుకి తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో విరాళాలు అందించారు. మొత్తంరూ93,396 విరాళాలను దాతలు అందజే యడం జరిగింది.వీరందరినీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు అభినందించారు.కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దృశ్యం

తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల

కందుకూరు లోని తిక్కవరపు రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల తరపున 48 వేల 396 రూపాయలు, అధ్యాపక బృందం ఒకరోజు వేతనం 28,224 మొత్తం కలిపి 76,620 రూపాయలు వరద బాధితుల సహాయార్థం పంపి ంచటం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ ఓరుగంటి వెంకటేశ్వర రావు తెలిపారు. శుక్రవారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి రాజు నాగేశ్వరరావుకి వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్ కి 48 వేల 396 రూపాయలు చెక్కును అధ్యాపక బృందంతో కలిపి అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి సుబ్బారావు, చుండూరి బాబురావు,కాశీరత్నం,కట్టా సుబ్బారావు, నరసింహారావు, రాజశేఖర్, హజరత్తయ్య, ఉష, శివకుమారికేథరిన్, మేరీ గ్రేస్, శేషగిరిరావు, రాజులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ సోమిరెడ్డితో మాట్లాడుతున్న నాయకులు

ఎపి జెన్కోలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి-ముత్తుకూరు: మండలం, మామిడిపూడి గ్రామంలోని ప్రజలకు ఏపీ జెన్కోలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సిపిఎం శాఖా కార్యదర్శి నక్క శ్యాంప్రసాద్ డిమాండ్ చేశారు. అదే విధంగా పెడింగ్‌లోని మత్స్యకారేతర ప్యాకేజీ బ్యాలెన్స్ 18,050 రూపాయలు ఇవ్వాలని, కంటైనర్ టెర్మినల్ తిరిగి కొనసాగించాలని, థర్మల్ విద్యుత్ కేంద్రాల ద్వారా వెలువడేటువంటి దుమ్ము ధూళి, పొగ, బూడిద నుంచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని, పరిశ్రమల ద్వారా సిఎస్సార్ నిధుల నుంచి మామిడిపూడి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. దీనిపైన వారు స్పందించి న్యాయం చేస్తామని మామిడిపూడి గ్రామంలో జరిగిన సభలో హామీ ఇచ్చారు.

మాలకొండ డిప్యూటీ కమిషనర్‌గా సాగర్ బాబు బాధ్యతలు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మండలంలోని శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా సాగర్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పెంచలకోన డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై మాలకొండ డిప్యూటీ కమిషనర్ గా వచ్చారు. ప్రస్తుతం పని చేస్తున్న డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు గుంటూరు, ఒంగోలు, నెల్లూరు జిల్లాల కమిషనర్ గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన సాగర్ బాబు మాట్లాడుతూ మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. దాతలను ప్రోత్సహించి ఆలయంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.


డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు

కేన్సర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-వెంకటాచలం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ హరిప్రియ విద్యార్థులకు కేన్సర్ వ్యాధి లక్షణాలు గురించి తెలియజేశారు. కేన్సర్ వ్యాధి లక్షణాలను ఉన్నటువంటి వ్యక్తులను వైద్య పరీక్షలు నిమిత్తం డాక్టర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టి.వరప్రసాద్ రావు, వెంకటాచల ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

29న మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు

డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన శెట్టిగుంట రోడ్డు ప్రాంతంలోని వీవర్స్ కాలనీ సెంటర్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ నాయకులు నరసింహ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలాజీనగర్ ప్రాంతంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ, నరేంద్ర మాట్లాడుతూ భారతదేశం గర్వించద గినటువంటి గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్ అని, అటువంటి మహోన్నత వ్యక్తి జయంతిని పురస్కరించుకోని ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అతి చిన్న వయసులో మరణించిన భగత్ సింగ్ ఆశయస్ఫూర్తితో నడుస్తున్న ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ విద్యార్థి యువజన సంఘాలు సంయుక్తంగా ఈ కార్యక్రమం ప్రతేడాది నిర్వహిస్తుందన్నారు. ఈ సంఘాలు విద్యార్థులకు యువజనులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వాటి పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తు ఒదన్నారు.జిల్లాలోని యువతీ,యువకులు అందరూ కూడా రక్తదానం చేసి ఈ రక్తదానం శిబిరాన్ని జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నా మని తెలియజేశారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి డి.చరణ్, డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు టి. జగదీష్, డి.వై.ఎఫ్.ఐ నగర నాయకులు శేఖర్, సురేష్,శ్రీహరి ,ఎస్ఎఫ్ఐ నగర నాయకులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ఆరోగ్యానికి చిరునామా యోగా

ప్రజాశక్తి-కందుకూరు

ఆధునిక ప్రపంచంలో యోగా ఆరోగ్యానికి చిరునామా అని హైదరాబాద్ కు చెందిన యోగా శిక్షకులు షణ్ముఖ శివచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు రామయ్య ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని యోగ అవగాహనపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సభలో టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకాశం చదువుల కార్కానా మాత్రమే కాదనేందుకు ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు బాహ్య ప్రపంచానికి పరిచయం చేస్తుంటామన్నారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ తమ విద్యార్థులు జాతీయం,రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీలలో విజేతలుగా నిలవడం పలు రంగాల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించడమే కీలక మన్నారు. యోగ ప్రక్రియలో తమ విద్యార్థులను చైతన్య పరిచిన షణ్ముఖ శివచంద్రను యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు శాలువాతో సత్కరించారు. "ది లైఫ్ ఆఫ్ మోడరన్ యోగి" పోస్టర్ ను, వీడియో డాక్యుమెంటరీని కరస్పాం డెంట్ తో షణ్ముఖ శివచంద్ర ఆవిష్కరింప చేశారు. ఫస్ట్ ఇయర్ ఓవరాల్ ఇన్ చార్జ్ జి.ప్రసాద్, హెచ్.ఓ.డి డాక్టర్ సూరియా, డాక్టర్ శైలేష్, ఎంబీఏ హెచ్.ఓ.డి డాక్టర్ కే.పావని, మ్యాథ్స్ ఇన్ చార్జ్ బాల బ్రహ్మాచారి, హిమబిందులు నిర్వాహకులుగా వ్యవహరించారు.



పంచాయతీ కార్మికుల మెరుపు సమ్మె

ప్రజాశక్తి-ఉలవపాడు

పంచాయతీ లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు 27 మంది తమ వేతనాలు పెంచాలని, కనీసం రూ.16వేలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం పనులను బహిష్కరించి, పంచాయతీ ఆఫీస్ వద్ద బైటాయించి మెరుపు సమ్మెకు దిగారు. ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆందోళన చేశారు.అనంతరం పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌కు,పాలకవర్గానికి వినతి పత్రం ఇచ్చారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అప్పటివరకు విధులకు హాజరు కామని తేల్చి చెప్పారు. పంచాయతీ కార్మికుల ఆందోళనకు సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్ మద్దతు గా పాల్గొని మాట్లాడారు.

వరద బాధితులకు విరాళం

ప్రజాశక్తి-నెల్లూరు

ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబాలకు తాము సైతం అంటూ శ్రీ నేతాజీ పైలట్ హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పాఠశాల మేనేజ్‌మెంట్ సేకరించిన రూ.4లక్షల మొత్తాన్ని విరాళంగా 'అపస్మా'కు అందజేసింది. ఆ మేరకు అపస్మా రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎంబి నేతాజీ సుబ్బారెడ్డికి అపస్మా కార్యవర్గమైన జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్, నెల్లూరు నగర అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, నెల్లూరు జిల్లా ట్రెజరర్ కృష్ణారావు, నెల్లూరు నగర ట్రెజరర్ అభిషేక్ రెడ్డి, నెల్లూరు నగర గౌరవ అధ్యక్షులు ఎస్.రామ్మోహన్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటాద్రి, జిల్లా కార్యదర్శి సురేష్ బాబు, నెల్లూరు నగర ఉపాధ్యక్షులు హరినాథ్ గారికి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ సుబ్రామ్, ప్రిన్సిపాల్ జి.సుధా, వైస్ ప్రిన్సిపల్ కె.స్పందన అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నేతాజీ ఎం.వి నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు రూ.10 నుండి రూ.10వేలు సేకరించిన వారున్నారన్నారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ సుబ్రామ్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించే సహకరించిన విద్యార్థినీ విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, తమ జీతం నుండి ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందజేసిన స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నేతాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు వేదవతి సుబ్బారెడ్డి, పాఠశాల సీనియర్ డైరెక్టర్ నరేంద్ర రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ సుబ్రామ్, డాక్టర్ అలేఖ్య, ఎస్.వి.ఎల్. నరసింహారావు, ప్రిన్సిపాల్ జి.వి.ఎస్.సుధా, వైస్ ప్రిన్సిపాల్ కె.స్పందన, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎం.రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

'స్వర్ణాంధ్ర -2047' బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి సూచనల మేరకు 30వ వార్డు సచివాలయంలో శుక్రవారం "గ్రామ సభ" నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులైన సందర్భంగా 30 వార్డులో వార్డ్ ఇన్‌ఛార్జ్ గాదంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో టిడిపి ప్రభుత్వం సాధించిన విజయాల గురించి, వార్డులో పలు సమస్యలపై వార్డు నాయకులు, సచివాలయ సిబ్బందితో గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో 30వ వార్డు జనసేన ఉపాధ్యక్షులు గాదంశెట్టి బాలు, టిడిపి నాయకులు పెసల పవన్, రాజా సుబ్బారావు, వేమూల శివ, తుమ్మలపెంట శీను, బెస్త ఇన్‌స్టిట్యూట్ ప్రసాద్, గొల్ల పాపయ్య, కిరణ్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని డిసిపల్లి సెక్టార్‌లోని పొంగారు కండ్రిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.పద్మావతి పాల్గొని మాట్లాడుతూ పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీలు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రాల సముదాయంలో పోషకాహార మాసోత్సవాలను శుక్రవారం కావలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ సౌజన్య నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ సామాజిక ఉద్యమ కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ సుహాసిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రతి తల్లీ బిడ్డకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం తప్పనిసరిగా సిడిపిఒ పద్మజ లావణ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శిశుసంక్షేమ కార్యాలయ ఆవరణలో పోషకాహార వారోత్సవాల్లో భాగంగా సిడిపిఒ పద్మజ లావణ్య ఆధ్వర్యంలో తహశీల్దార్ సుభద్ర సమక్షంలో పోషకాహార వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సబ్‌జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి : కావలి సబ్ జైల్లో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కావలి మండల లీగల్ సర్వీసెస్ సెక్రటరీ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.విక్రమ్ సిన్హా హాజరై, ఖైదీలకు కొన్ని చట్టాలను వివరించారు. సమాజంలో చెడు ప్రభావాలను విడిచి మంచిగా మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ.సాయిప్రసాద్, జైలు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కావలి : జిల్లాస్థాయి అండర్-19 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్ పోటీలకు కావలి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వాలీబాల్ విభాగంలో కె.దుర్గారావు టేబుల్ టెన్నిస్ విభాగంలో పి.సాయితేజ రెడ్డి, కబడ్డీ విభాగంలో ఎ.శ్రావణి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వెంకయ్య, డైరెక్టర్ ఎం.కొండయ్య, పివిఎస్ ప్రసాద్, కళాశాల గౌరవ సలహాదారు సంపతరావు మధుసూదన రావు, కళాశాల ప్రిన్సిపాల్ టి వి లుకీథర్, ఫిజికల్ డైరెక్టర్, వెంకటేశ్వర్లు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

బాక్సింగ్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెనుబల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాక్సింగ్ క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంఇఒలు పి.దిలీప్, పి.వి.రత్నం మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని అందించడంతోపాటు మానసిక ఒత్తిడిని తగ్గించడంలో ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఎంపికైన విద్యార్థులు డిసెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పోటీల్లో పాల్గొంటారు. ఎంపికలకు వ్యాయామ ఉపాధ్యాయులు సిరాజ్ అహ్మద్, దేవిక, నరసయ్య, రాజేష్, ప్రవీణ కుమార్ సెలెక్షన్ వ్యవహరించగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతకృష్ణ పర్యవేక్షించారు.

ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి : ఎంపిడిఒ దేవరకొండ ఈశ్వరమ్మకు కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపిడిఒగా విధులు నిర్వహించి ప్రకాశం జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఈశ్వరమ్మను సర్పంచులు, వివిధ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ శ్రీనివాసరాజు, ఎంఇఒ తోట శ్రీనివాసులు, వైసిపి మండల కన్వీనర్ సిఎం ఓబుల్ రెడ్డి, దాసరపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్ మొహిద్దీన్, తిరుమలాపురం సర్పంచ్ ఎం.తిరుపతి, గన్నేపల్లి సర్పంచ్ వెంకటప్పయ్య, హుస్సేన్, ఎఇ రామకృష్ణ, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా కరటంపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అభ్యుదయ మహిళా మండలి నిర్వాహకులు శుక్రవారం పరిశుభ్రం చేశారు. సంస్థ అధ్యక్షురాలు జె.జయలక్ష్మి సంస్థ సిబ్బందితో కలిసి పాఠశాల ఆవరణలో పేరుకు పోయి ఉన్న ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.నరసింహులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇంటింటి ఫీవర్ సర్వే'

ప్రజాశక్తి-ఉదయగిరి : సచివాలయం టిబి-1 పరిధిలోని సినిమా హాల్ వీధి, మంగలిక్కు, సింగనపల్లి వీధి, కసాయిలపేట ప్రాంతాల నివాసాల్లో శుక్రవారం ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కలపాటి వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జ్వరం వస్తే తక్షణమే ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్స్ అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : పదో తరగతి విద్యార్థుల మార్కుల సర్టిఫికెట్లను ఆయా పాఠశాలలో అందుబాటులో ఉండాలని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మార్చిలో పరీక్షలు రాసిన విద్యార్థుల మార్కులు సర్టిఫికెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. మండలంలో 5 జెడ్‌పి, 1 ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 1 రెసిడెన్షియల్ స్కూల్, 2 ప్రయివేట్ హైస్కూల్ ఉన్నాయన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 10 తరగతిలో ఉత్తీర్ణులైన 350మంది విద్యార్థుల సర్టిఫికెట్లు వచ్చాయన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

ప్రజాశక్తి-అనంతసాగరం : మండల కేంద్రంలోని హజరత్ మస్తాన్ ఆలీషా ఖాదరి దర్గా 14వ గంధ మహోత్సవం నిర్వాహకులు సాని సాహెబ్, మజీద్ సాహెబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా చైర్మన్ మీరాన్, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : ముసునూరులోని మదరసాలో శుక్రవారం 'నైతికతయే నిజమైన స్వేచ్ఛ' "స్వేచ్ఛ పేరుతో మోసపోవద్దు" అనే అంశంపై జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు, కార్యకర్తలు నూర్జహాన్, ఫాతిమా, హమేరా తదితరులు పాల్గొన్నారు.

కాలువకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కంపచెట్లు, పూడికతో కూరుకుపోయి ఉన్న యేటి కాలువ మరమ్మతులు ఇంత వరకు చేపట్టలేదని వెంటనే మరమ్మతులు చేయించాలని ఏపి రైతుసంఘం మండల కమిటీ నాయకులు శుక్రవారం వారు ఆ మేరకు ప్రకటన విడుదల చేశారు. యేటి కాలువ వద్ద పరిశీలించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. సోమశిల ఆనకట్ట నుండి ఉత్తర కాలువకు ఆత్మకూరు నియోజకవర్గ ఎంఎల్ఎ, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి సాగునీటిని విడుదల చేశారని తెలిపారు. సోమశిల ప్రాజెక్టులో సుమారు 54 టి.ఎం.సి. నీటినిల్వలు ఉన్నా యన్నారు. శుక్రవారం సోమశిల జలాలు రామస్వామిపల్లి వద్దకు చేరాయన్నారు. ఒకట్రెండు రోజుల్లో ఆత్మకూరు చెరువుకు ఈ సోమశిల జలాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అయితే ఆత్మకూరు చెరువుకు సంబంధించిన సప్లయి కెనాల్ (యేటి కాలువ) పూర్తిగా చెట్లతో నిండిపోయి నీరు ప్రవహించేందుకు కూడా వీలులేని

యేటి కాలువ వద్ద పరిశీలిస్తున్న నాయకులు

పరిస్థితులలో ఉందని, అందువల్ల రైతుల నష్టపోతారని తెలిపారు. ఎపి రైతుసంఘం మండల శాఖ 20రోజుల క్రితం గొల్లపల్లి వద్ద ఉన్న యేటి కాలువను సందర్శించి కాలువకు మరమ్మతులు చేసి ఆత్మకూరు చెరువుకు సాఫీగా సాగునీరు అందేవిధంగా చూడాలని కోరిందన్నారు. అయితే అటువంటి యేటి కాలువ మరమ్మతులు కానీ యేటి కాలువలో ఉండే చెట్లను తొలగించే చర్యలు కానీ ఇంతవరకు చేపట్టలేదన్నారు. ప్రస్తుతం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విడుదల చేసిన సోమశిల జలాలు ఆత్మకూరు చెరువుకు వచ్చే అవకాశం లేకుండా పోతుందని తెలిపారు. సుమారు 6వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఆత్మకూరు చెరువుకు సప్లయి కెనాల్ నిర్వహణ లోపభూయిష్టంగా ఉండడం రైతుల పాలిట శాపంగా మారింద న్నారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెరువు కింద భాగంలో ఉండే పంట కాలువల మరమ్మతులకు రూ.22.80 లక్షలు కేటాయింపు చేసి ఉన్నారని సదరు పనులు కూడా పూర్తి అయ్యాయన్నారు. అయితే ఆత్మకూరు చెరువుకు సాగునీటిని అందించే యేటి కాలువ మరమ్మతులకు నిధులు కేటాయించక పోవడం వల్ల ఆత్మకూరు చెరువుకు సోమశిల జలాలు వచ్చేందుకు వీలు లేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మంత్రి జోక్యం చేసుకొని సుమారు 7 కిలోమీటర్ల పొడవున 10 మీటర్ల వెడల్పున ఉన్న ఆత్మకూరు చెరువు సప్లయి కెనాల్‌ను మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం ఆత్మకూరు మండల కమిటీ కోరుతుందన్నారు. ఎపి కౌలు రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంటా లక్ష్మీపతి, ఆత్మకూరు మండల కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కృష్ణమోహన్, కృష్ణ ప్రసాద్ కోరారు.

అక్రమ అరెస్టులపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి-కావలి

ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామంలో అక్రమంగా రైతుల పొలాల్లో అనుమతి లేకుండా, ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా నిర్మిస్తున్న పెట్రో పైప్‌లైన్‌ను అడ్డుకున్న రైతులను, వారికి మద్దతుగా పాల్గొన్న సి.ఐ.టి.యు. జిల్లా అధ్యక్షులు టి.వి.వి. ప్రసాద్‌ను అరెస్ట్ చేయడాన్ని వ్య.కా.సం. ఖండిస్తుందని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి, మండల ప్రధాన కార్యదర్శి ఎం.రాధాకృష్ణయ్య ప్రకటనలో తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రజాశక్తి-దగదర్తి : ఇందుకూరుపేట మండలంలో రైతులను పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని సిపిఎం మండల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలంలోని పల్లెపాడు గ్రామంలో గతంలో గ్యాస్ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తుండగా భూమి కోల్పోయిన రైతులు పనులను అడ్డుకొని కోర్టు ఆశ్రయించగా దానిపై కోర్టు స్టే ఇవ్వడంతో పనులను నిలిపివేశారని, మళ్లీ పైపులైను పనులు ప్రారంభిస్తుండగా గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు రైతులు పనులను అడ్డుకోవడంతో అక్రమంగా వారిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. మార్కెట్ రేట్ ప్రకారం డబ్బులు చెల్లించాలన్నారు. కోర్టులో ఉన్న దానిని ఏ విధంగా ప్రారంభిస్తారో.. అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోపసాని రమేష్, మండల నాయకులు ఒంటేరు సుధాకర్, ఎస్‌కె కాలేషా, మంద మహేష్, చల్లా మల్యాద్రి, పిరికల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై కేసు నమోదు

ప్రజాశక్తి-కొడవలూరు : మండలంలోని గండవరం గౌతమ్‌నగర్ పంచాయతీ చెందిన బండ్ల.సురేంద్రబాబును గురువారం రాత్రి ఐదుగురు కొట్టి గాయపరిచినట్లు ఎస్ఐ కోటిరెడ్డి తెలిపారు. ఈ వివాదానికి కారణం పొలం గొడవలు అని తెలిపారు. అదే గ్రామానికి చెందిన బండ్ల జనార్దన్, మల్లికార్జున, మోహన, లావణ్య, రజినీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మజ్దూర్ యూనియన్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-బిట్రగుంట

విజయవాడ డివిజన్ రైల్వే పరిధిలోని బిట్రగుంట రైల్వే మజ్దూర్ యూనియన్ ఎన్నికల ప్రచారాన్ని శ్రీ వెంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ నుండి పడుగుపాడు రైల్వేస్టేషన్ వరకు శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించినట్లు బిట్రగుంట బ్రాంచ్ రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్ మద్దిపోయిన వెంకటశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 4, 5, 6తేదీల్లో జరిగే రైల్వే యూనియన్ ఎన్నికలలో భాగంగా రైల్వే మజ్దూర్ యూనియన్ తరఫున పడుగుపాడు నుండి శ్రీ వెంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న రైల్వే కార్మికులకు కరపత్రాలను అందించి ఎన్నికల గుర్తులు తెలిపామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ మద్దిబోయిన వెంకట శేఖర్, బిట్రగుంట రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ సిహెచ్ వెంకటేశ్వర్లు, జెడ్‌డబ్ల్యూసి సుధీర్, పిఆర్ బాబు, మధు, శ్రీహరి, సురేంద్ర, వి ఎస్ బాబు, మహీంద్ర, బిట్రగుంట బ్రాంచ్ రైల్వే మజ్దూర్ యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతోనే 'స్వర్ణాంధ్ర-2047' సాధ్యం

ప్రజాశక్త-బుచ్చిరెడ్డిపాలెం :

విద్యార్థులందరి భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్యం అవుతుందని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం చింతంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం "స్వర్ణాంధ్ర -2047" పై వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విజ్ఞానం, వికాసం, నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. నైపుణ్యంతో పాటు క్రమ శిక్షణ కలిగి ఉండాలని చదువుపై పట్టుదల కూడా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ గ్రూపు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు వేదవతి, నిర్మల, బ్రహ్మారెడ్డి, వేణు, మున్వర్ అహ్మద్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలన

ప్రజాశక్తి-ఉదయగిరి :

నల్లబల్లపై విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్య నైపుణ్యాలను ఎంఇఒ- 1 షేక్ మస్తాన్ వలీ పరిశీలించారు. శుక్రవారం ఆయన ఉదయగిరిలోని మెయిన్ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నల్లబల్లపై ఒకేసారి పలువురు విద్యార్థులకు గణితంలో సామర్థ్యాలను పరిశీలించారు. 2వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించగా, డ్రాయింగ్ చక్కగా వేసిన విద్యార్థిని అప్సానను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుల వివక్షతను రూపుమాపాలి

ప్రజాశక్తి -కావలి

మండలంలోని నారాయణపురంలో కుల వివక్షత రూపుమాపాలని కోరుతూ శుక్రవారం సదరు గ్రామంలో శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం, కె.వి.పి.ఎస్. ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సభకు కె.వి.పి.ఎస్. నాయకులు వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.జాన్ మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా నారాయణపురంలో కుల వివక్షత కొనసాగడం అన్యాయమన్నారు. దానిని అట్టడుగు వర్గాల వారందరూ సంఘటితంగా వ్యతిరేకించాలన్నారు. అభ్యుదయవాదులు అణగారిన వర్గాల వారి యెడల వివక్షతను చూపడంపై ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వ్య.కా.సం. రాష్ట్ర

మాట్లాడుతున్న నాయకులు

కార్యవర్గ సభ్యులు టి.మాల్యాద్రి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, ఎం.రాధాకృష్ణయ్యలు దళితులు, గిరిజనులకు అండగా ఉంటామని, వివక్షతకు వ్యతిరేకంగా ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.

ఒవెల్ స్కూల్లో 'స్వచ్ఛ భారత్'

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు నగరంలోని 11వ డివిజన్ సరస్వతీ నగర్‌లోని ఒవెల్ మోడ్రన్ పాఠశాలలో స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరవస్తు నాగసాయి సూరి విచ్చేశారు. ఈ సందర్భంగా నాగసాయి సూరి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని 2014 అక్టోబర్ 2వ తేదీ బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛభారత్ లేదా స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. అంతేకాక 1947 ఆగస్టు 15న మనకు స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా ప్రజలందరూ జెండా ఎగరవేసుకొని సంబరాలు జరుపుకుంటుంటే గాంధీజీ మాత్రం మురికివాడలకు వెళ్లి శుభ్రం చేస్తున్నారని తెలిపారు. ఎందుకంటే నిజమైన స్వాతంత్ర్యం అంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అని గాంధీ ఆనాడే పిలుపునిచ్చారు. స్వచ్ఛత అంటే చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా మనసును కూడా స్వచ్ఛంగా ఉంచుకోవాలని నాగసాయి సూరి విద్యార్థులకు అందరికీ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు

సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

స్వచ్ఛభారత్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చక్కగా తమ ప్రతిభను చూపినవారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు ప్రిన్సిపల్ ప్రభా కర్, పరవస్తు నాగసాయి సూరి విద్యార్థులకు అంద జేశారు. హైస్కూల్ విద్యార్థులు పాఠశాల మైదానం లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఓవెల్ పాఠశాలల సి.ఎం.డి. ఆర్ వేణు, సిఇఒ ప్రమీల, ఇ.డి. బాలు, జి.ఎం. మహదేవ్, డి.జి.ఎం. శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రభాకర్ శర్మ, హైస్కూల్ ఇన్‌ఛార్జ్ మల్లికార్జున, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ రమాదేవి, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జ్ సుప్రజ, యోగా మేడం పద్మావతి, ఎ.జి.ఎం. సునీల్, పి.ఇ.టి. వెంకటేష్, ఇతర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతమ్మ మృతి బాధాకరం

ప్రజాశక్తి-కావలి

పారిశ్రామిక సంస్థల దిగ్గజం మాజీ ఎంపి, మాజీ ఎంఎల్ఎగా పనిచేసిన మాగుంట పార్వతమ్మ చనిపోవడం జిల్లా ప్రజలకు చాలా బాధాకరం అని న్యాయవాది, సామాజిక కార్యకర్త ఐ.సాయి ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. కావలి ఎంఎల్ఎగా అసెంబ్లీలో అడుగుల వేసిన తర్వాత తనకు తెలిసిన ఎన్నో విషయాలు ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు వస్తున్నాయో ప్రజలకు తెలియజేయడంలో పార్వతమ్మ ముందుండే వారన్నారు. అటువంటి మహనీయురాలు పార్వతమ్మ లేకపోవడం బాధాకరమని, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు.

ఎస్ఐకు ఘన సన్మానం

ప్రజాశక్తి-మర్రిపాడు

ఎస్ఐ కె.శ్రీనివాస రావును శుక్రవారం ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లోని సమస్యలను ఆయనకు వివరించారు. ఎస్ఐ సానుగులుగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా ఎంఎంఎస్ మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు వడ్లపల్లి రమణమ్మ మాదిగ, ఆత్మకూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి టి.లక్ష్మయ్య మాదిగ, సీనియర్ నాయకులు జి.ఆదినారాయణ మాదిగ, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు ఎన్.అంకయ్య మాదిగ, మండల నాయకుడు మంద నరేంద్ర మాదిగ, మండల ఎంఆర్‌పిఎస్ నాయకులు కుంట మల్లికార్జున మాదిగ, ఎన్.ఆదివయ్య మాదిగ, ఎన్ విల్సన్ మాదిగ, కె.ఉపేంద్ర మాదిగ, ఎస్.రూపమాదిగ, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

స్థానిక వెలుగు కార్యాలయంలో బదిలీపై వెళ్లిన అధికారులను శుక్రవారం సిబ్బంది శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఆత్మకూరు వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న బందిలి వెంకమ్మ విడవలూరు మండలానికి బదిలీ అయ్యారు. అలాగే అక్కడ పని చేస్తున్న ఎపిఎం కాగొళ్ళు హరి ఆత్మకూరు వెలుగు కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయనను సిబ్బంది ఘనంగా శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా ఏరియా కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న పి.వెంకటేశ్వర్లు, కావలికి బదిలీ కావడంతో ఆయనను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యోగ బదిలీ సర్వసాధారణమని ఎక్కడికి వెళ్లినా ఉద్యోగ విధులను బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఎపిఎం వెంకమ్మ విధి నిర్వహణలో అత్యంత బాధ్యతగా వ్యవహరించి మంచిపేరు సంపాదించుకున్నారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

- రూ.లక్షల చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు : విలాసవంతమైన జీవనానికి అలవాటు పడి డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడి తప్పించుకుని తిరుగుతున్న మూర్తి నవీన్, అరవ సుబ్రహ్మణ్యం, షేక్ అబ్దుల్ లతీఫ్ అను ముగురు నిందితులను వేదాయపాళెం పోలీసులు అరెస్టు చేసి నిందితుల నుంచి రూ.5 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణలు, ల్యాప్‌టాప్, ఎల్ఇడి టివిలను స్వాధీనం చేసుకున్నట్లు నగర డిఎస్‌పి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి నిందితుల అరెస్టు, చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్న విధానం మీడియాకు వివరించారు. ఈ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభను చూపిన వేదాయపాళెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎస్ కిశోర్‌కుమార్, ఎస్ఐ ఎం.వెంకటరావు, ఏఎస్ఐ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ జి.సుబ్బారావు, ఎస్‌కె మహబూబ్‌బాషా, పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-మర్రిపాడు

గురుపూజోత్సవం సందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్‌కు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు కుంటనీళ్లపాడు ప్రధానోపాధ్యాయుడు యలగాల శ్రీనివాసులు, పడమటి నాయుడుపల్లి బి.సి. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాహీన్‌బేగంలను కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు పడమటి నాయుడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి ధనలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ ఇరువురు ఉపాధ్యాయులు ఎంతో నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసి, అందరి మన్ననలను పొంది ఉత్తమ గురువులుగా గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో కదిరినాయుడుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, విశ్రాంత ఎంఇఒ జొన్నా సత్యనారాయణ, ఎం.ఆర్.జి రాజేంద్రకుమార్, స్కూల్

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సెక్రటరీ విజయభాస్కర్ రెడ్డి, చుంచులూరు ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు డి.వి.రమణయ్య, కాంప్లెక్స్‌లోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నయ్య, సుబ్బయ్య, వెంగయ్య, వెంకటరెడ్డి, సునీత, పడమటి నాయుడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నాగమణి, ఉపాధ్యాయులు పెంచలరావు, మల్లికార్జున స్వామి, అశోక్, శ్రీనివాసులు, రమణ, విజయా రెడ్డి, సుబ్బారెడ్డి, శివయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, సుధాకర్, భాగ్యలక్ష్మి, ఎంఇఒ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బస్ సర్వీస్ రద్దుతో ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి -వరికుంటపాడు

మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, విరువూరు మీదుగా ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లే ఉదయగిరి ఆర్‌టిసి బస్సు రోజూ రాత్రి 8గంటలకు ఉదయగిరి నుండి బయలుదేరుతుంది. ఈ రూటులో సుమారు పది గ్రామాలు ఉన్నాయి. ఇటీవల బస్సు సర్వీసును రద్దు చేయడంతో ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. హైదరాబాద్‌కు కూలి పనులు నిమిత్తం వలసపోయిన వారు ఆయా గ్రామాల నుంచి ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉందని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కొత్త సౌకర్యాలు కల్పించకున్నా పర్వాలేదు కానీ, కనీసం ఉన్న సౌకర్యాలను తొలగించొద్దు అని ఆయా గ్రామాల ప్రయాణికులు డిపో మేనేజర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ :

సాధారణ బదిలీలలో భాగంగా ఆత్మకూరు ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం నుండి నెల్లూరు ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన జానకినయోమీని శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారి ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆమె సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారి (పి.ఆర్. అండ్ ఆర్.డి), పరిపాలనాధికారి, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన

ప్రజాశక్తి-కావలి : విద్యార్థి దశలోనే రక్తం, రక్తదాన ఆవశ్యకత, రక్త సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని టీం సేవియర్స్ ప్రతినిధులు పేర్కొన్నారు. టీం సేవియర్స్, నేతాజీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహనా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని వశిష్ఠ జూనియర్ కళాశాలలో రక్తదానంపై అవగాహన, ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీం సేవియర్స్ ప్రతినిధి కృష్ణజాత్రి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బాధితులు, ప్రసవించే తల్లులు, ఇతర ఆపరేషన్ పేషెంట్లతో పాటు పుట్టుకతోనే జన్యు సంబంధిత వ్యాధులైన తలస్సేమియా, హిమోఫిలియా కలిగిన బాలలకు రక్తం ఎక్కించాల్సిన అవసరం కలుగుతుందన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, చెట్ల నుండి, రాళ్ల నుండి రక్తం రాదని, మానవత్వం కలిగిన మరో వ్యక్తి రక్తదానంతోనే ప్రాణాలు కాపాడబడతాయన్నారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది 197మందికి ఉచితంగా రక్తనిర్ధారణ పరీక్షలు నిర్వహించి, గుర్తింపు కార్డులు అందజేశారు. టీం సేవియర్స్ సభ్యులు తనిష్క, తేజస్విని, కృష్ణజాత్రి, శ్రావ్య, భవాని, జగదీష్, దీపు, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో 50వేల గుండె ఆపరేషన్లు

ప్రజాశక్తి -నెల్లూరుప్రతినిధి : కిమ్స్ (బొల్లినేని) ఆస్పత్రిలో గత 24యేళ్లలో సుమారు 50 వేల గుండె ఆపరేషన్లు నిర్వహించినట్లు పముఖ కార్డియాలజిస్ట్ డా॥ సి.ఎస్.శ్రీనివాస రాజు, తెలిపారు. శుక్రవారం ఆసుపత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆసుపత్రిలోని ప్రముఖులు డాక్టరు సాహెబ్ పీర్, నాగరాజారావు, లోకేష్ ఆధ్వర్యంలో 50వేలకు పైగా గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామన్నారు. కార్డియాలజీ విభాగం సుమారు 24యేళ్ల క్రితం కార్డియాలజీ నెల్లూరులో సరైన, మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉండేవి కావవని, ఎవరికైనా ప్రమాదకర పరిస్థితి ఏర్పడితే వారిని చెన్నైకిగాని, నెల్లూరుకు గాని లేదా ఇతర పట్టణాలకు తరలించవలసిన పరిస్థితి ఉండేవన్నారు. ఇలాంటి పరిస్థితులలో నెల్లూరు అత్యాధునిక పరికరాలతో, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావు, వారి తండ్రి జ్ఞాపకార్థం, ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి బొల్లినేని రమణయ్య మెమోరియల్‌హాస్పిటల్ నిర్మించారన్నారు. ఈ బొల్లినేని హాస్పిటల్‌లో కార్డియాలజీ డిపార్ట్‌మెంట్‌ను ఉన్నంత వనరులతోనే స్థాపించి, ఉన్న సిబ్బంది సహకారంతోనే మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందిస్తూ ఈ డిపార్ట్‌మెంట్‌ను ప్రస్తుతమున్న అత్యున్నతస్థాయికి తీసుకువచ్చారన్నారు. కిమ్స్ (బొల్లినేని) ఆస్పత్రి అంటే కార్డియాలజీ మాత్రమే అన్నంతగా ఈ చుట్టుప్రక్కల జిల్లా ప్రజలు మనస్సుల్లో చెరగని ముద్ర పడిపోయిందన్నారు. ఒ.పి.బయట రోగులు 442487, ఐ.పి.ఆస్పత్రి రోగులు 54900, సిఎజి 31480, పిటిసిఎ 9725, పిపిఐ 643, ఎఐసిడి 11, ఎఎస్‌డి క్లోసర్స్ 179, ఇపిఎస్ అండ్ ఆర్‌ఎఫ్ఎ 62, పిబిఎంవి 103, పిడిఎ 75, టిపిఐ 597, సిఆర్‌టిడి 2, టోటల్ ప్రొసీడర్స్ 42976, సిటి సర్జరీస్ 6984, టోటల్ 50060, ఆపరేషన్ చేశామన్నారు. రాయలసీమ, దక్షిణకోస్తా జిల్లాలలో మొట్టమొదటి కిమ్స్, నెల్లూరులో మాత్రమే అందుబాటులో ఉందన్నారు. గుండె ధమనుల్లో ఉన్న కొవ్వు, కాల్షియంతో కూడిన అడ్డంకులు (బ్లాక్స్)ను కెమెరా ద్వారా పరీక్షించి, స్టంట్ ఖచ్చితత్వంతో అమర్చడానికి ఉపయోగించే ఆత్యాధునిక పరికరాలున్నాయన్నారు. కేవలం మెట్రో నగరాలకు మాత్రమే పరిమితం అయిన ఈ నూతన చికిత్సా విధానం ఇప్పుడు నెల్లూరులో కిమ్స్‌లో అందుబాటులో ఉందన్నారు. క్లిష్ట తరమైన యాంజీయోప్లాస్టీలు, స్టంట్స్ అమర్చడంలో ఓసిటి ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరాజు

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A No.167/2024
O.S.No. 76/2024

Manubolu Sudheer Kumar ...పిటిషనరు/వాది
Vs
Devalla Jaya and 3 others ...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

ఆక్షేపణ నోటీసు

To
R1: Devalla Jaya, S/o. Late Krishnaiah
R3: Devalla Raja, S/o. Ramanaiah both are residing at Jogipalli Village, Sydapuram (m) SPSR Nellore Dist.,

ప్రతివాదులకు నోటీసు

పై దావాలో పిటిషనరు పై పిటిషను షెడ్యూలు దాఖల ఆస్తిపై Temporary Injunction (తాత్కాలిక ఇంజంక్షన్) కోరుచూ దావా వేసినందున మీ మీ నోటీసు నిమిత్తం తేది 14.10.2024న వాయిదా వేసినారు. కనుక ఆ రోజు 10:30 ని॥లకు మీరుగానీ, మీ తరపు వకీలు గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
వడ్డె శ్రీనివాసరావు
పిటిషనరు/వాది తరపు న్యాయవాది
నెల్లూరు

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 76/2024

Manubolu Sudheer Kumar ...వాది
Vs
Devalla Jaya and 3 others ...ప్రతివాదులు

దావా నోటీసు

To
D1: Devalla Jaya, S/o. Late Krishnaiah
D3: Devalla Raja, S/o. Ramanaiah both are residing at Jogipalli Village, Sydapuram (m) SPSR Nellore Dist.,

ప్రతివాదులకు నోటీసు

పై దావాలో వాది ఈ దావా షెడ్యూలు దాఖలా భూమిపై పర్మనెంటు ఇంజంక్షన్ కోరుచూ మీపై దావా వేసియున్నందున మీకు నోటీసు నిమిత్తం తేది 14.10.2024న వాయిదా వేసినారు. ఆ రోజు 10:30 ని॥లకు మీరుగానీ, మీ తరపు వకీలు గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలసినది లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు
వడ్డె శ్రీనివాసరావు
పిటిషనరు/వాది తరపు న్యాయవాది
నెల్లూరు